# నకిలీ సర్టిఫికెట్ల దందా.. ముగ్గురు అరెస్ట్

పోలీసుల అదుపులో నిందితులు

మెహిదీపట్నం, మే 15: వివిధ యూనివర్సిటీలకు చెందిన నకిలీ సర్టిఫికెట్లను విక్రయిస్తున్న ముగ్గురిని పశ్చిమ మండల టాస్క్ ఫోర్స్ పోలీసులతో కలిసి మాసబ్‌ట్యాంక్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 15 నకిలీ సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర వివరాల ప్రకారం... మాసబ్ ట్యాంక్ షెహబాజ్ ఖాన్ (29), యాకుత్‌పుర మురుతుజా నగర్‌కు చెందిన మహమ్మద్ అబ్దుల్ ఇస్మాయిల్ (30), పాతబస్తీ శాలివాహన నగర్‌కు చెందిన కడారి రమేశ్ (52)లు ఉన్నత విద్యకు సంబంధించిన సర్టిఫికెట్లను తయారు చేసి విక్రయిస్తున్నారు. గురువారం మాసబ్ ట్యాంక్ ప్రాంతంలో షెహబాజ్ ఖాన్‌ను పోలీసులు పట్టుకున్నారు. విచారణలో అబ్దుల్ ఇస్మాయిల్ గురించి చెప్పగా.. అతడిని అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరూ ఇచ్చిన సమాచారంతో రమేశ్‌ను పట్టుకున్నారు. నకిలీ సర్టిఫికెట్లు అవసరమైన వారి ఆధార్ కార్డులను తీసుకొని ఢిల్లీలో ఉన్న సాగర్‌కు రమేశ్ పంపుతాడు. సాగర్ సర్టిఫికెట్లను తయారుచేసి తిరిగి రమేశ్‌కు పంపుతాడు. ఇక్కడ వీరు ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.80వేలు వసూలు చేస్తున్నారు. ఈ ముగ్గురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

# టైం స్కేల్ వర్తింపజేయాలి..

## ఓయూ కాంట్రాక్ట్ నాన్ టీచింగ్ ఉద్యోగుల మహా ర్యాలీ

ఓయూ పరిపాలన భవనం ముందు ప్లకార్డులతో నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న తమకు తక్షణమే టైం స్కేల్ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ ఓయూ నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ గురువారం మహా ర్యాలీ నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల నుంచి ప్రారంభించిన ఈ ర్యాలీ పరిపాలన భవనం వరకు సాగింది. అనంతరం ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ర్యాలీలో ఉద్యోగులు తమ డిమాండ్లపై ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా తాము పనిచేస్తున్నప్పటికీ ప్రభుత్వం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. గత నాలుగేళ్లుగా తమ వేతనం సైతం పెంచలేదని గుర్తు చేశారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాన్ని పెంచాలని కోరారు. ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందికి రూ.30 వేల వేతనాలు చెల్లిస్తూ 350 మందిని భర్తీ చేసుకున్నారని, అయితే.. దాదాపు 25 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు రూ. 15000 మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు టైం స్కేల్ వర్తింపచేయాలని విజ్ఞప్తి చేశారు.

# నీ భార్యకు విడాకులు ఇస్తావా..రూ.కోటి ఇస్తావా..

## వ్యాపారిని బ్లాక్‌మెయిల్ చేస్తున్న వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, మే14: నీ భార్యకు విడాకులు ఇస్తావా..లేకుంటే రూ.1కోటి ఇచ్చి ఆమెతో నేను కలిసి ఉన్న నగ్న ఫొటోలు డిలీట్ చేయించుకుంటావా ..అంటూ ఓ వ్యాపారిని బ్లాక్‌మెయిల్ చేస్తున్న వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదయింది. వివరాల్లోకి వెళ్తే.. నగరంలో హోటల్ వ్యాపారంలో ఉన్న ఓ వ్యక్తి (37) జూబ్లీహిల్స్‌లో నివాసం ఉంటున్నారు. అతడితో విభేదాల కారణంగా భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. ఇటీవల ఇద్దరు చర్చలు జరుపుకుంటున్నారు. కాగా.. గతంలో వ్యాపారి ఇంట్లో డ్రైవర్‌గా పనిచేసిన ఇఫ్తెకార్ అహ్మద్(24) ఇటీవల వ్యాపారికి ఫోన్ చేశాడు. మీ భార్యతో తనకు వివాహేతర సంబంధం ఉందని, ఆమెతో తాను నగ్నంగా దిగిన ఫొటోలు ఉన్నాయంటూ బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. ఏడాది క్రితం వ్యాపారి ఇంటికి వచ్చిన ఇఫ్తెకార్.. ఆమెతో మళ్లీ కలిసి ఉండే ప్రయత్నాలు మానుకోవాలని, విడాకులు ఇవ్వాలని. ఒక వేళ ఆమెతో కాపురం చేస్తే రోజూ నరకం చూపిస్తానని, తామిద్దరం దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. మళ్లీ ఫోన్‌చేసి బెదిరించి బంజారాహిల్స్ రోడ్ నం.12లోని నీలోఫర్ కేఫ్‌కు రావాలంటూ ఫోన్‌చేయగా వ్యాపారి అక్కడకు వెళ్లాడు. అక్కడ.. నీ భార్యకు విడాకులు ఇవ్వాలని, లేకుంటే తనకు రూ.1కోటి ఇస్తే అన్ని వీడియోలు, ఫొటోలు డిలీట్ చేస్తానంటూ డిమాండ్ చేశాడు. డబ్బులు ఇవ్వకపోతే తమ వీడియోలు అన్నీ సోషల్ మీడియాల్లో పోస్ట్ చేస్తానని బెదిరించాడు. ఇఫ్తెకార్ వేధింపులు ఎక్కువ కావడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# పెళ్లికి నిరాకరించిందనే ప్రియురాలి భర్త హత్య

- ఎనిమిదేండ్ల తర్వాత పథకం అమలు..
- ప్రధాన నిందితుడు అరెస్ట్..

హత్య వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ సురేశ్ కుమార్.. (ఇన్‌సెట్‌లో) నిందితుడు పవన్

కేపీహెచ్‌బీ కాలనీ, మే 15: ఓ యువతిని వన్‌సైడ్ లవ్ చేశాడు... పెళ్లి చేసుకునేందుకు ఆమె తల్లిదండ్రులను బంధువులతో అడిగించాడు.. వారు నిరాకరించి.. యువతికి ఆరో యువకుడితో పెండ్లి జరిపించారు. దీనిపై కక్షపెంచుకున్న లవర్.. 8 ఏండ్ల తర్వాత ప్రియురాలి భర్త గుండెల్లో కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశాడు...చివరికి పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యాడు. కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ హత్యకేసు వివరాలను గురువారం బాలానగర్ డీసీపీ సురేశ్ కుమార్, ఏసీపీ శ్రీనివాసరావు, సీఐ రాజశేఖర్‌రెడ్డిలతో కలిసి వెల్లడించారు. ఏపీ, కాకినాడకు చెందిన పంపేన అయ్యప్ప స్వామి అలియాస్ పవన్ (27) 9వ తరగతి చదివాడు. చిన్నప్పుడే తల్లి చనిపోవడంతో మేనత్త ఇంటిదగ్గర పెరిగాడు. ఈ సమయంలో శ్రావణి సంధ్య అనే అమ్మాయిని వన్‌సైడ్ లవ్ చేశాడు. పెళ్లి చేసుకుంటానని ఆమె తల్లిదండ్రులను బంధువులతో అడిగిపించాడు. అతని చెడు ప్రవర్తన కారణంగా అతనికి ఇచ్చి పెళ్లి చేయడానికి తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. కొద్ది రోజులకు రాజమండ్రి దగ్గరలోని కోరుకొండ మండలం, ములగాడు గ్రామానికి చెందిన కాళ్ల వెంకటరమణ(32)కు శ్రావణ సంధ్యను ఇచ్చి వివాహం జరిపించారు. ఈ కుటుంబం కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని భగత్‌సింగ్ నగర్ ఫేస్-1లో నివాసం ఉంటున్నారు. కాగా ..ఇటీవల తన సోదరితో కలిసి శ్రావణి సంధ్య రాజమండ్రికి వెళ్ళగా...అక్కడ పవన్‌కు కనిపించింది. ఏలాగైనా అమ్మాయిని దక్కించుకోవాలంటే ఆమె భర్తను చంపాలని ప్రణాళిక సిద్ధం చేసుకుని.. కేపీహెచ్‌బీకాలనీలో యువతి నివసించే ఇంటికి సమీపంలోకి మకాం మార్చాడు. తరచుగా వెంకటరమణ ఇంటి పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ... ఇబ్బంది పెట్టేవాడు. ఇంటి ముందు బైక్ పార్క్ చేయడం, అడిగితే దుర్భాషలాడడం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 10న అర్ధరాత్రి... వెంకటరమణ తన తోటి అల్లుడు దుర్గాప్రసాద్ ఇంట్లో బంధువులతో కలిసి ఉండగా... పవన్ వచ్చి గొడవ మొదలు పెట్టాడు. పవన్‌తో స్నేహితులైన గుప్పల శివరామకృష్ణ (20), రాజమహేంద్రవరం అనిల్ (19), నంబిగారి సాయికుమార్ (20), మరో బాలుడు ఉన్నారు. ఈ క్రమంలో వెంకటరమణతో వాగ్వాదానికి దిగిన పవన్.. తన వెంట తెచ్చుకున్న కత్తితో అతని గుండెల్లో పొడిచాడు. కొద్ది క్షణాల్లోని వెంకటరమణ కన్నుమూశాడు. సమాచారం అందుకున్న పోలీసులు.. మరునాడు నిందితులైన గుబ్బల శివరామకృష్ణ , అనిల్, సాయికుమార్, మరో బాలుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. పరారీలో పవన్‌ను గురువారం అరెస్ట్‌చేసి రిమాండ్ కు తరలించారు. ఈ కేసును ఛేదించిన పోలీసులు బృందాన్ని డీసీపీ అభినందించారు.

# అఫ్జల్‌గంజ్‌లో భారీ అగ్ని ప్రమాదం..

## నాలుగు ఫైరింజన్లతో అదుపులోకి మంటలు

## ఏడుగురిని కాపాడిన ఫైర్ సిబ్బంది..

జియాగూడ, మే 15 : హైదరాబాద్ అఫ్జల్‌గంజ్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. గురువారం ఉదయం 9గంటల ప్రాంతంలో మూడు అంతస్తుల రెసిడెన్సియల్ భవనంలో ఈ ప్రమాదం సంభవించింది. భారీగా మంటలు ఎగసిపడడంతో.. మొదటి అంతస్తు నుంచి రెండు, మూడు అంతస్తులకు భారీగా మంటలు వ్యాపించాయి. వెంటనే స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని నాలుగు ఫైర్ ఇంజన్ల ద్వారా మంటలు ఆర్పేశారు. బ్రాండో స్కై లిఫ్ట్ ద్వారా అందులో చిక్కుకున్న వారిని కాపాడారు. భారీ ల్యాడర్ ద్వారా అందులో చిక్కుకున్న రెండు కుటుంబాలకు చెందిన ఏడుగురిని సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ భవనంలో ప్లాస్టిక్ గోదాం ఉండడంతో మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. షార్ట్ సర్క్యూట్‌తోనే ఈ ప్రమాదం జరిగినట్లు ఫైర్ అధికారులు గుర్తించారు.

# టాటా ఏస్ ఢీకొని కూలీ మృతి

కృష్ణ (ఫైల్)

దుండిగల్ ,మే 15: మద్యం మత్తు, ఆపై అతివేగంతో వాహనంతో వెళ్తూ ఎదురుగా వస్తున్న వ్యక్తిని ఢీ కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, దుండిగల్ గ్రామం, ఎస్సీ కాలనీకి చెందిన యాప్రాల కృష్ణ (52) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వైపు నుంచి బస్‌స్టాప్ వైపు నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో ఎదురుగా వేగంగా వచ్చిన టాటా ఏస్ (టీఎస్ 08యూఎఫ్ 3637) అతడిని ఢీ కొట్టింది. తీవ్ర గాయాలతో కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

# నగరంలో పలుచోట్ల ఆబ్కారీ దాడులు

## 5.515కిలోల గంజాయి పట్టివేత.. తొమ్మిది మంది అరెస్ట్

పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

సిటీబ్యూరో, మే 15 (నమస్తే తెలంగాణ): నగరంలోని పలు చోట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో తొమ్మిది మందిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 5.515కిలోల గంజాయి, మూడు బైక్‌లు, 10సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌టీఎఫ్ ఈఎస్ అంజిరెడ్డి కథనం ప్రకారం ...ధూల్‌పేట్ ప్రాంతానికి చెందిన బంగ్లా వాల అజయ్ సింగ్ , జయశ్రీ బాయి, మీనాక్షిలు స్థానికంగా గంజాయి విక్రయిస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ పోలీసులు వారి నివాసాలపై దాడులు జరిపి.. ఆ ముగ్గురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 3.209 కేజీల గంజాయితో పాటు ఒక ద్విచక్రవాహనంను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

మరో కేసులో 1.02 కేజీల గంజాయిని పట్టుకున్నారు.. బల్కంపేట్ సిద్ధార్థ సింహాద్రి సదన్ సమీపంలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ పోలీసులు స్థానిక ప్రాంతాల్లో దాడులు జరిపారు. ఈ దాడుల్లో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఎరసాని రాణి, చుక్క ఆనంద్ బాబులను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరో నిందితుడు చింతల దుర్గా ప్రసాద్‌పై కేసు నమోదు చేశారు. అలాగే.. బాలానగర్ వినాయకనగర్‌లో గంజాయి విక్రయిస్తున్న కటిక యోగేందర్, దేవరకొండ విశాల్, రితిక్‌లను అరెస్టు చేసి, 1.306కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

# పోలీస్ డ్రైవర్ ఆత్మహత్య

నేరేడ్‌మెట్, మే 15 : హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని తిరుమలగిరి డివిజన్ ఏసీపీ కార్యాలయంలో డ్రైవర్‌గా పనిచేస్తున్న గొర్ల గోవర్ధన్ యాదవ్ (33) చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధి వినోభానగర్‌లో చోటుచేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గోవర్ధన్ యాదవ్ కూతురు కిడ్నీ వ్యాధితో చికిత్స పొందుతుంది. దీంతో మనస్తాపానికి గురైన గోవర్ధన్..మద్యానికి బానిసై రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

# యువకుడు దారుణ హత్య

మెహిదీపట్నం, మే 15 : హత్య కేసులో నిందితుడిగా ఉన్న ఓ యువకుడు కోర్టుకు వచ్చి ఇంటికి తిరిగి వెళ్తుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి హత్య చేశారు. ఈ సంఘటన నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నారాయణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..పాతబస్తీ బాబానగర్‌కు చెందిన అయాన్ ఖురేషి (20).. తన బావ హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. గురువారం నాంపల్లి కోర్టుకు హాజరు కోసం వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో నీలోఫర్ హోటల్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు అయాన్ ఖురేసిని కత్తులతో పొడిచి పారిపోయారు. తీవ్ర గాయాలతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఘటన స్థలాన్ని డీసీపీ శిల్పవల్లి, ఏసీపీ సంజయ్‌తో కలిసి సందర్శించారు. హత్యకు పాల్పడ్డ వారిని పట్టుకుంటామని ఉన్నతాధికారులు తెలిపారు.

# కుటుంబ కలహాలు.. చెరువులో దూకి ఆత్మహత్యాయత్నం

## తల్లి, చిన్న కూతురు మృతి..

## ఇద్దరు పిల్లలను కాపాడిన స్థానికులు

కూతుళ్లతో నాగరాజు- సుజాత దంపతులు(ఫైల్)

పీర్జాదిగూడ, మే 15 : కుటుంబ కలహాలతో ఓ తల్లి.. ముగ్గురు పిల్లలతో కలిసి చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించగా.. తల్లి, చిన్న కూతురు మృతి చెందగా, మరో ఇద్దరిని స్థానికులు కాపాడారు. ఈ ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం... మహబూబ్ నగర్ జిల్లా అడ్డాకుల మండలం, కన్మనూరుకు చెందిన లోకమని నాగరాజు, భార్య సుజాత( 32 ) 15 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. అక్కడినుంచి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి నారపల్లి మహాలక్ష్మిపురం కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు ఆడపిల్లలు. పెద్ద కూతురు అక్షిత, రెండవ కూతురు ఉదయశ్రీ, చిన్న కూతురు వర్షిణిలు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారు. నాగరాజు ఆటో డ్రైవర్‌గా, సుజాత స్థానికంగా చెరుకు బండి నడిపిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. అయితే.. కొంతకాలంగా భార్యపై అనుమానం పెంచుకోవడంతో భార్యాభర్తల భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. దీంతో ఈ విషయంపై బుధవారం పెద్దల మధ్య పంచాయితీ జరిగింది. ఈ క్రమంలో రాత్రి మళ్లీ గొడవ జరగడంతో తీవ్ర మనస్తాపానికి గురైన సుజాత గురువారం మధ్యాహ్నం తన ముగ్గురు పిల్లల్ని తీసుకొని నారపల్లిలో ఉన్న చెరువులో దూకింది. గమనించిన స్థానికులు ఇద్దరు పిల్లలను రక్షించగా.. తల్లి, చిన్న కూతురు నీటిలో మునిగి మృతి చెందారు.

# బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని..

## తీవ్ర గాయాలతో యువతి మృతి

హిమాయత్ నగర్, మే 15: అతి వేగం ఓ యువతి ప్రాణం తీసింది. ఈ ఘటన నారాయణగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ వివరాల ప్రకారం.. కూకట్‌పల్లికి చెందిన ఉష శ్రీ (21), అభిషేక్(21) స్నేహితులు. ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. బుధవారం రాత్రి హిమాయత్‌నగర్ వీధి నం.14లో స్నేహితుడి ఇంట్లో జరిగిన ఫంక్షన్‌కు హాజరయ్యారు. తిరిగి గురువారం ఉదయం 7 గంటల సమయంలో అభిషేక్, ఉషశ్రీలు కలిసి యమహా బైక్‌పై వెళ్తుండగా.. బైక్ అదుపుతప్పి హిమాయత్‌నగర్ ప్రధాన రహదారిలోని డివైడర్‌ను ఢీకొన్నది. దీంతో ఉష శ్రీకి తీవ్ర గాయాలు కాగా 108లో హైదర్‌గూడలోని అపోలో దవాఖానకు తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. అభిషేక్ సైతం తీవ్ర గాయాలు కావడంతో అదే దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై షఫీ మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించి.. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో మోసం

## లక్షలు కాజేసి బోర్డు తిప్పేసిన ప్యూరోపాల్ ఐటీ సొల్యూషన్స్ కంపెనీ

## గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

శేరిలింగంపల్లి, మే 15: నిరుద్యోగుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసి మోసం చేసిన ప్యూరోపాల్ క్రియేషన్స్ & ఐటీ సొల్యూషన్స్ కంపెనీ బోర్డు తిప్పేయడంతో సుమారు 200 మంది నిరుద్యోగులు రోడ్డున పడ్డారు. ఈ మేరకు ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ నేతృత్వంలో నిరుద్యోగ బాధితులు గురువారం గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్యూరోపాల్ కంపెనీ యాజమాన్యం, స్కిల్ హబ్ కన్సల్టెంట్ లపై క్రిమినల్ చర్యలు తీసుకొని తమ డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని వేడుకున్నారు. ఉద్యోగాలిస్తామని చెప్పి సెక్యూరిటీ డిపాజిట్ కింద ఒకొక్కరినుంచి రూ. 2.50లక్షలను దాదాపు 200 మంది నుంచి వసూలు చేసిందని వాపోయారు. నమ్మించి మోసాలకు పాల్పడిన కంపెనీపై కఠిన చర్యలు చేపట్టి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు .

### ప్రభుత్వ వైఫల్యం: సుధాకర్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను దారుణంగా మోసం చేస్తున్న నకిలీ ఐటీ కంపెనీలను గుర్తించి కఠిన చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం విఫలమైందని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. నకిలీ ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగానికి ఎంపికైనట్లు నమ్మించి నిరుద్యోగులను ఉద్యోగాల పేరుతో బురిడీ కొట్టించే సంస్థలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆప్ నేతలు విజయ్ ముల్లంగి, నర్సింగ్ యమునా గౌడ్, సుధారాణి, రమ్య గౌడ్, అజీజ్ బేగ్, మహమ్మద్ షాబాజ్, ఖాన్, ఎస్ఎన్ రెడ్డి, సోహైల్, ఎహసాన్, బాధితులు అజయ్, గోపాల్ రెడ్డి, సూర్యతేజ, తదితరులు పాల్గొన్నారు

# సీనియర్ సిటిజన్ కేసు దర్యాప్తునకు ఆదేశం

మేడ్చల్ కలెక్టరేట్, మే 15 : భార్య, కుమారులు తనను వేధించారని, బలవంతంగా ఇంటి నుంచి వెళ్లగొట్టారని, తన వస్తువులు, అద్దె ఆదాయం ఇవ్వడంలేదని ఆరోపిస్తూ సీనియర్ సిటిజన్ షార్వాలే నర్సింగ్ రావు దాఖలు చేసిన ఫిర్యాదును తెలంగాణ మానవ హక్కుల కమిషన్ పరిగణనలోకి తీసుకుంది. తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం, 2007 ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని, కేసును సమగ్ర దర్యాప్తు చేసి పరిష్కారం కోసం సంబంధిత అధికారికి సూచించాలని జిల్లా కలెక్టర్‌ను కమిషన్ ఆదేశించింది. తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను 30.6.2025 నాటికి కమిషన్ ముందు దాఖలు చేయాలని హెచ్ఆర్‌సీ.. కలెక్టర్‌కు సూచించింది.

# చేతన్ జ్యువెలర్స్ యజమానిపై కేసు

పరారీలో ఉన్న చేతన్ జ్యువెలర్స్ యజమాని నితీశ్ జైన్

దుండిగల్, మే 15: రూ.10 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, నగదుతో బోర్డు తిప్పేసిన ప్రగతినగర్‌లోని చేతన్ జ్యువెలర్స్ యజమాని నితీశ్‌జైన్‌పై బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. నిజాంపేటకు చెందిన ఓ బాధితురాలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, పరారీలో ఉన్న నితీష్ జైన్‌పై చీటింగ్ కేసు నమోదు అయింది. సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం...నిజాంపేటలోని రవి సాత్విక అపార్ట్‌మెంట్లో నివాసముంటున్న రాధా రాణి ఫిబ్రవరిలో ప్రగతినగర్‌లోని పీకాక్ చౌరస్తా సమీపంలో ఉన్న చేతన్ జ్యువెలర్స్ షాప్‌లో 125 గ్రాముల బంగారు నగలను తయారు చేయించుకుంది. అయితే అవి బాగా లేకపోవడంతో తిరిగి వాపస్ ఇచ్చి మళ్లీ తనకు నచ్చినట్లు చేయాలని సూచించింది. మార్చిలో చంద్రహారం, 4 బంగారు గాజులు, 1 కాసుల హారం చేయమని ఆర్డర్ ఇచ్చింది. అదే సమయంలో 3.5 కిలోల వెండి వస్తువుల తయారీకి ఆర్డర్ ఇచ్చింది. ఇందుకోసం ఫోన్ పే ద్వారా, నగదు రూపేనా జ్యువెలర్స్ షాపు యజమాని నితీష్ జైన్‌కు రూ.15.50 లక్షలు అడ్వాన్స్‌గా అందజేసింది. తర్వాత నగల కోసం అడుగగా రేపు మాపంటూ గత రెండు నెలలుగా దాటవేస్తూ వస్తున్నాడు. నేపథ్యంలోనే మీడియాలో చేతన్ జ్యువెలర్స్ యజమాని రూ.10 కోట్ల నగలతో ఉడాయించినట్లు రావడాన్ని గుర్తించిన రాధా రాణి.. షాపు వద్దకు వెళ్లి చూడగా నగల దుకాణం మూసి ఉన్నది. దీంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా రాజస్థాన్‌కు చెందిన నితీశ్ జైన్ గడిచిన 15 ఏళ్లుగా ఇక్కడ జ్యువెలర్స్ షాప్ నిర్వహిస్తూ నమ్మకంగా ఉండి మోసానికి పాల్పడి.. రాజస్థాన్ వెళ్లి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. త్వరలోనే అరెస్ట్ చేసి తీసుకువస్తామని పోలీసులు తెలిపారు. నితీశ్ జైన్ మోసంపై 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో గురువారం 'రూ.10 కోట్ల విలువ గల నగలతో బంగారం షాపు యజమాని పరార్' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విధితమే.

# చైనా క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి అంటూ బురిడీ

## ఐటీ ఉద్యోగికి రూ. 32.5 లక్షలు టోకరా

సిటీబ్యూరో, మే 15 (నమస్తే తెలంగాణ): చైనా కొత్తగా క్రిప్టో కరెన్సీని ప్రవేశపెడుతుందని, అందులో పెట్టుబడి పెడితే మంచి లాభాలొస్తాయంటూ నమ్మించి ..ఒక ఐటీ ఉద్యోగికి సైబర్‌నేరగాళ్లు రూ. 32.50 లక్షలు బురిడీ కొట్టించారు. రామంతాపూర్‌కు చెందిన ఐటీ ఉద్యోగి వాట్సాప్‌కు చైనా క్రిప్టో కరెన్సీ ప్రవేశపెడుతుంది, అందులో ఇన్వెస్ట్ చేస్తే లాభాలొస్తాయంటూ ఒక మెసేజ్ వచ్చింది. అది నిజమని నమ్మిన బాధితుడు మొదట రూ.3లక్షలు(3 వేల యుఎస్‌డీటీ) పెట్టుబడి పెట్టి కొంత లాభం తీసుకున్నాడు. దీంతో అది నిజమనే నమ్మకం కుదిరింది. కొత్త యూజర్స్‌కు ఎక్కువ మొత్తంలో పెట్టుబడి పెడితే 8888 యుఎస్‌డీటీ బోనస్‌గా వస్తుందని, దీనికి 80 వేల యుఎస్‌డీటీ పెట్టుబడి పెట్టాలంటూ నమ్మించారు. తాను అంతగా పెట్టుబడి పెట్టలేనంటూ చెప్పడంతో కొద్ది కొద్దిగా అయినా పెట్టుబడి పెట్టవచ్చని, మేం కొంత సర్ధుబాటు చేస్తామని, దానికి రోజువారి వడ్డీ ఉంటుందంటూ నమ్మించారు. దీంతో బాధితుడు కొంత డిపాజిట్ చేయడంతో భారీ లాభాలు స్క్రీన్‌పై కన్పించాయి. వెంటనే రూ. 19 లక్షలు చెల్లించాలని, లేదంటే భారీగా జరిమానాలు పడుతాయంటూ భయపెట్టించారు. అయితే అప్పటికే రూ. 32.50 లక్షల వరకు బాధితుడు అందులో పెట్టుబడి పెట్టాడు. ఒకే రోజు భారీ లాభాలు రావడం, వెంటనే రూ.19లక్షలు చెల్లించాలంటూ చెబుత